## శ్రీరాంపూర్ ఏరియాలోని ఖాళీలను భర్తీ చేయాలి

- టీబీజీకేఎస్ డిమాండ్

శ్రీరాంపూర్, జూన్ 13: శ్రీరాంపూర్ ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల్లోని ఖాళీలను అంతర్గత కార్మికులతో భర్తీ చేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కే సురేందర్ రెడ్డి, బండి రమేశ్ డిమాండ్ చేశారు. ఓవర్ మెన్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్లు, ఎలక్ట్రీషన్, ఫిట్టర్, వెల్డర్, సర్వేయర్, జనరల్ మజ్దూర్ల ఖాళీలను వెంటనే సంస్థలో పనిచేస్తున్న అర్హతగల కార్మికులతో భర్తీ చేయాలని కోరారు. ఖాళీలు భర్తీ చేయక పోవడంతో ఉత్పత్తి, ఉత్పాదకతకు అంతరాయం కలుగుతుందన్నారు. కార్మికులపై పని ఒత్తిడి, పనిభారం పడుతున్నదన్నారు. దీంతో రక్షణ కొరవడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్రాంచ్ కార్యదర్శి పానగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, నాయకులు సాదుల భాస్కర్, మహిపాల్‌రెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, వికాస్, రమణారెడ్డి, లాలా, రాజు నాయక్ పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

శ్రీరాంపూర్, జూన్ 13 : సింగరేణి కార్మికుల సమస్యలు ప్రభుత్వ కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీతోనే పరిష్కారం అవుతున్నాయని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఆర్కే 5గనిపై ఉద్యోగ నియామక వయసు పెంపుపై పటాకలు కాలుస్తూ సంబురాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియామక వయసు పెంపుపై ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి, తమ యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు ఏ ఇబ్బందులు రాకుండా తాము కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు 36 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వానికి 26 సార్లు విజ్ఞప్తులు చేసినట్లు వివరించారు. యూనియన్ బాధ్యతగా ఇచ్చిన హామీల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తామన్నారు. 20 లక్షల వడ్డీలేని గృహ రుణాలు, అలవెన్స్‌పై ఆదాయపు పన్ను రద్దుకు కృషి చేస్తామన్నారు. అధికారులకు ఇస్తున్న విధంగా రెండో పింఛన్ అమలు చేపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, కార్యదర్శి భీంరావు, తిరుపతిరాజు, ఏరియా కార్యదర్శి వెంగళ కుమారస్వామి, నాయకులు పేరం రమేశ్, మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య, వెంకటేశ్వర్లు, రంగశెట్టి శ్రీనివాస్, సత్యనారాయణ, పెద్దిరాజు, యాదగిరి, పెట్టం శ్రీనివాస్, నంబయ్య పాల్గొన్నారు.

## ఉపాధి పనులకు వెళ్లివస్తూ..

- అడవిలో తప్పిపోయిన మహిళ
- పెద్దపులి సంచరించే కారిడార్‌లో

**ఆరు గంటల పాటు గడిపిన రాజేశ్వరి**


దవాఖానలో చికిత్స పొందుతున్న రాజేశ్వరి

నెన్నెల, జూన్13 : ఉపాధి పనులకు వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో ఓ మహిళ అడవిలో తప్పిపోయి ఆరు గంటలపాటు గడిపింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలో గురువారం జరిగింది. నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి రాజేశ్వరి ఉపాధి పనుల కోసమని తోటి కూలీలతో కలిసి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లింది. ఎండల నేపథ్యంలో ఉదయం 8 గంటలకు పనులు పూర్తి చేసుకున్న ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో దారి తప్పి కోటపల్లి మండలం పంగిడి సోమారం అటవీ ప్రాంతానికి వెళ్లింది. మిగితా కూలీలు పనులు ముగించుకుని ఇండ్లకు చేరుకోగా, రాజేశ్వరి రాకపోవండంతో భర్త బాపు తోటి కూలీలను ఆరా తీశాడు. గంట ముందే పొలం వద్దకు పోయి వస్తనని చెప్పిందని వారు తెలుపగా, పొలం కాడికి వెళ్లి చూశాడు. అక్కడా కూడా కనిపించకపోవడంతో కూలీలతో కలిసి అడవిలో కలియదిరిగారు. ఈ క్రమంలో కాలినడకన పంగిడి సోమారం గుట్టల వరకు దాదాపు 15 కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా పెద్ద పులి సంచరించే కారిడార్‌లోనే గడిపింది. చివరకు నీరసించి చెట్టు నీడన ఉన్న రాజేశ్వరిని అటుగా ఎడ్లబండ్లపై వస్తున్న వారు గమనించారు. ఆపై ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వెళ్లి ఆమెను తీసుకొచ్చారు. తీవ్ర అవస్థతతో ఉన్న ఆమెను నెన్నెల పీఈహెచ్‌సీలో చేర్చారు. కాగా, ఇంత జరిగినా ఈజీఎస్ సిబ్బంది ఆమె కోసం ఆరా తీయలేదని కుటుంబ సభ్యులు మండిపడ్డారు..

# 18 నుంచి ఈపీ ఆపరేటర్ల నియామక పరీక్ష


రెబ్బెన : ఖైర్‌గూడ ఓసీపీ లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, జూన్ 13 : ఈ నెల 18 నుంచి శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో అంతర్గత ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై గురువారం జీఎం ఆఫీస్‌లో జీఎం సంజీవరెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 21 వరకు ఈపీ ఆపరేటర్ల ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలను వీడియో గ్రఫీ ద్వారా చిత్రీకరించినట్లు తెలిపారు. అభ్యర్థులందరూ నిర్ణీత సమయంలో ప్రగతి స్టేడియంలో హాజరు కావాలని కోరారు. దళారుల మాటల నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఎరియా సర్వే ఆఫీసర్ వెంకటేశం, ఇంచార్జి సివిల్ డీజీఎం రాము, ఎస్ఈ కిరణ్‌కుమార్, డీవైపీఎం దేవేమదర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు, ఈఈ రవి పాల్గొన్నారు.

**18,19 తేదీల్లో ఈపీ ఆపరేటర్ ట్రైనీ సెలక్షన్.**

మందమర్రి, జూన్ 13: ఈ నెల 18,19 తేదీల్లో సింగరేణి పాఠశాల ఆవరణలో ఈపీ ఆపరేటర్ ట్రైనీ సెలక్షన్ ఉంటుందని సింగరేణి మందమర్రి ఏరియా జీఎం ఏ.మనోహర్ తెలిపారు. ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి ఈపీ ఆపరేటర్ కోసం 187 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలపారు. సింగరేణి పాఠశాల ఆవరణలో ఉదయం 6 గంటల నుండి సెలక్షన్ ఉంటుందని ఆయన తెలిపారు. ఈపీ ఆపరేటర్ సెలక్షన్ ఉన్నందున ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు గ్రౌండ్ మూసి వేస్తున్నట్లు తెలిపారు. వ్యాయామం కోసం వచ్చే వారు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డీజీఎం(ఐఈడి) రాజన్న, డీజీఎం(సివిల్) శ్రీనివాసులు, కేకే ఓసీ ఇంజనీర్ రాజు, ఎస్ఈ వర్క్ షాప్ నాగరాజు నాయక్, డీవైపీఎం మైత్రేయ బంధు, డీవైపీఎం సత్యబోస్, ఎస్ఎస్ఓ(ఎస్ అండ్ పీసీ) రవి తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగోన్నతుల కోసం పరీక్షలు**

రెబ్బెన, జూన్ 13: బెల్లంపల్లి ఏరియా లోని ఖైర్‌గూడ ఓసీపీ లో ఈపీ ఆపరేటర్ ఉద్యోగోన్నతుల కోసం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. 22 మంది ఈపీ ఆపరేటర్లు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, పిట్ ఇంజినీర్ వీరన్న, పర్సనల్ మేనేజర్లు శ్యామ్‌సుందర్, రెడ్డిమల్ల తిరుపతి, ఇంజినీర్లు మహేశ్వర్, కురేషితో పాటు పలువురు పాల్గొన్నారు.

## సేఫ్టీ కమిటీలతో సమీక్షలు లేకనే ప్రమాదాలు

శ్రీరాంపూర్, జూన్ 13 : సింగరేణిలో సేఫ్టీ కమిటీలతో యాజమాన్యం అధికారులు సమీక్షలు జరపక పోవడంతో నియంత్రణ చర్యలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌గోపాల్ ఆరోపించారు. గురువారం శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1గనిని సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే సేఫ్టీ కమిటీలతో గనులు, ఓసీపీలల్లో రక్షణ చర్యలు చేపట్టడానికి సమీక్షలు నిర్వహించాలన్నారు. సింగరేణి గుర్తింపు పత్రం 4 సంవత్సరాల పరిమితితో ఇవ్వాలని ఏఐటీయూసీ పట్టుబడుతుందన్నారు. సీఎల్సీ నిబంధనల మేరకు 2 సంవత్సరాలకే ఇస్తున్నదన్నారు. కార్మికుల సమస్యలు ఏఐటీయూసీ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కార్మికుల సమస్యలు పేరుకపోతున్నాయని తెలిపారు. గనిలో గాలి వెలుతురు సరిపడా ఉండడం లేదన్నారు. ఆర్ఎల్సీ సమక్షంలో కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలు యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పేర్లలో దొర్లిన తప్పుల సవరణ చేయాలన్నారు. విజిలెన్స్ అధికారులు కార్మికులను వేధించడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజర్ శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సీనియర్ నాయకుడికి పరామర్శ

రెబ్బెన, జూన్ 13: ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు ముడిమడుగుల రాంచందర్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని ఐఎన్‌టీయూసీ ఏరియా నాయకులు కలిసి వెళ్లి పరామర్శించినట్లు బెల్లంపల్లి ఏరియా ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకుడు సంగెం ప్రకాశ్‌రావు లు తెలిపారు. పరామర్శించిన వారిలో ఏరియా కార్యదర్శి మాధవకృష్ణ, జీపీ చంద్రకుమార్, పిట్ కార్యదర్శులు భాస్కరచారి, రవికుమార్, ఛీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు గోలెం గట్టయ్య, మసాడి నారాయణ, ఏరియా దవాఖాన నాయకులు వినయ్‌కుమార్, నాయకులు ఇందారపు రాజన్న, బూర శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేశ్, లక్ష్మణ్, గోవింద్, రాజేశ్, శ్రీకాంత్, సంతోష్, మహేందర్, సాయికృష్ణ లతో పాటు పలువురు ఉన్నారు.

# నులి పురుగులను నిర్మూలిద్దాం

- మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్, జూన్ 13 : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నిర్మూలిద్దామని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఎంహెచ్‌వో అనిత, ప్రోగ్రాం అధికారి నీరజ, డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. 19 ఏళ్లలోపు వారందరికీ మాత్రలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 2,01,143 మంది పిల్లలకు మాత్రలు అందించేందుకు కార్యాచరణ రూపొందించామని, ఆ రోజు మాత్రలు అందని వారి కోసం ఈ నెల 27న మరో సారి పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో డెంగ్యూ ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి నీరటి రాజేశ్వరి, గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం, సర్వైలెన్స్ అధికారి ఫయాజ్, మున్సిపల్ కమిషనర్‌లు, వైద్యాధికారులు, వైద్యకళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గృహ రుణం వడ్డీ చెల్లింపుపై ఆంక్షలు ఎత్తివేతకు సర్క్యులర్ జారీ

-ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, జూన్ 13 : సింగరేణి కార్మికుల గృహ రుణాల వడ్డీ చెల్లిపుపై విధించిన ఆంక్షలు ఎత్తివేస్తూ గురువారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. గత కొంతకాలంగా కార్మికుల గృహ రుణాలపై వడ్డీ చెల్లింపు ఆంక్షలు విధించిందని ఆరోపించారు. దీనిపై ఆంక్షలు ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. గృహ రుణం తీసుకుంటే సంవత్సరం లోపు వారికి మాత్రమే వడ్డీ చెల్లించారని, దీని వల్ల చాలా మంది కార్మికుల సంవత్సరం దాటిన వారికి యాజమాన్యం వడ్డీ చెల్లించలేదని పేర్కొన్నారు. 8.33 శాతం కంటే తక్కువ వడ్డీకి బ్యాంకు రుణం తీసుకున్న వారికి 6 లేదా 7 శాతం చెల్లించారని పేర్కొన్నారు. ఈ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఆంక్షలు ఎత్తి వేయాలని కోరినట్లు తెలిపారు. దీంతో ఆంక్షలు ఎత్తి వేస్తూ సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఆర్థిక సంవత్సరం మార్చి తర్వాత ఇల్లు కట్టుకున్నా, కొనుక్కున్న తర్వాత ఎప్పుడైనా బ్యాంకు రుణం తీసుకుంటే వారికి కూడా వడ్డీ చెల్లించేందుకు, తక్కువ వడ్డీకి రుణాలూ తీసుకున్న వారికి కూడా 8.33 శాతం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరిస్తూ సర్క్యులర్ జారీ చేసిందని ఆయన తెలిపారు.

## కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, జూన్ 13:సింగరేణి లో ఇంటి రుణం పై వడ్డీ చెల్లింపు అంక్షలు ఎత్తివేత సర్క్యూలర్‌ను సింగరేణి యాజమాన్యం జారీ చేసినట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య వెల్లడించినట్లు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

శ్రీరాంపూర్, జూన్ 13 : శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి మొదటి విడత అర్హులైన విద్యార్థులు 14 జూన్ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. 1 ఆగస్టు 2024 నాటికి 14 సంవత్సరాలు నిండి, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ మెయిల్ ఐడీ, సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ట్రేడ్‌లు కంప్యూటర్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీఓపీఏ)లో 2 యూనిట్స్ 1 సంవత్సరం కోర్సులో 48 సీట్లు, ఎలక్ట్రిషన్ 1 యూనిట్స్ 2 సంవత్సరల కోర్సులో 20 సీట్లు, మెకానిక్ డిజిల్ 1 యూనిట్స్ 1 సంవత్సరం కోర్డులో 24 సీట్లు, ఫిట్టర్ 1 యూనిట్ 2 సంవత్సరాల కోర్సులో 20 సీట్లు, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ 1 యూనిట్ 2 సంవత్సరాల కోర్సులో 24 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన విధ్యార్థులు ఆన్‌లైన్ http://iti telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

మంచిర్యాల ఏసీసీ, మే 13: అప్పుల బాధతో ఉరి వేసుకొని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన రాంటెంకి రవి కుమార్ (32) ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి భార్య సంతోషి ఓ ప్రైవేట్ దవాఖానలో నర్సుగా విధులు నిర్వహిస్తున్నదన్నారు. ఆమె నైట్ డ్యూటీ వెళ్లగా బుధవారం రాత్రి రేకుల ఇంట్లో నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం తెల్లవారు జామును కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.


